

# లయతప్పిన అనురాగం

— ఉమాధర్

నా శ్రీమతికి నాపట్ల వున్న అనురాగానికి ఎంతగా పొంగిపోతానో, ఒకోప్పుడంతగా కృంగిపోతూవుంటాను.

అనుక్షణం నన్నూ, నా అవసరాల్నీ కనిపెట్టుకుని నాక్కావలసిన సదుపాయాలన్నీ సమకూరుస్తూవుంటుంది. నిజం చెప్పాలంటే నేనెప్పుడేమి చేయాలో మర్చిపోయేలా చేసింది.

అయితే ఆమెతో నాకు వచ్చినది ఒకే ఒక చిక్కు. అదీ సామాన్యమైనది కాదు.

నన్ను మరో స్త్రీ సమక్షంలోగానీ, మరో స్త్రీని నా సమీపంలోగానీ, ఉద్యోగ రీత్యా కానివ్వండి — లేదా ఏదైనా ఫంక్షన్ సందర్భాల్లో కానీయండి — చూడటం తటస్థించిందో... మన్నూ మిన్నూ ఏకమయేలా అల్లరి అల్లరి చేసి పెడుతుంది. వీధి వీధంతా దద్దరిల్లిపోయేలా ఏడ్చి గోలపెడుతుంది. అలాంటి సందర్భాల్లో ఆమెకెంతో నెమ్మదిగా నచ్చచెప్పాలని అనుకుంటాగానీ, తీరా ఆ సమయం వచ్చేసరికి ఆమె వీరంగం చూసిన నాకు చిర్రెత్తిపోయి, జరిగే అల్లరి కింత ఆజ్యం పోస్తుంటాను నా వాటాగా. మామూలుగా దీన్నే 'అనుమాన పిశాచం' అంటారు. కానీ నాకు తెలుసు. నా శ్రీమతి విషయంలో ఈ మాట సరికాదు. అది నిజానికి నా శ్రీమతికి నా మీద వున్న అపరిమితమైన అనురాగం కలుగజేసే విపరీత మానసిక స్థితేగానీ మరో దుర్గుణమేమీ కాదు.

"ఏమండీ... నీరూకి కాలేజ్ వెకేషన్ మొదలయిందట. నాల్గు రోజులు మన దగ్గర గడపటం కోసం వస్తానని లెటరు రాసిందండీ..." బి.యస్సీ మొదటి సంవత్సరం చదువుతూన్న తన చెల్లి నీరజ రాసిన ఉత్తరాన్ని చూపిస్తూ అంది నా శ్రీమతి "రమ్మని రాయమంటారా?"

"అదేవిటోయ్... అది (మొదట్నించీ తెల్సినవాళ్ళు కావటంవల్ల మా మధ్య చనువెక్కువ) రావటానిక్కి నా అనుమతి కావాలా? చక్కగా రమ్మని రాయి. అది వస్తే నాకు మాత్రం సంతోషం కాదూ..." రొటీన్‌లో మనస్ఫూర్తిగా అనేసి, వెంటనే నాలిక్కరుచుకున్నాను. ఎందుకంటే నా శ్రీమతి అసహనానికి వాళ్ళ చెల్లి కూడా ఏమీ ఎక్సెప్షన్ కాదు.

"అంటే మా చెల్లి వస్తే మీ కెందుకంటా అంత సంతోషం?" అని ముక్కెగరేసి నిలేశెయ్యగలదు.

అయితే నా అదృష్టం. ఆ సమయంలో ఆమె అంత రిసెప్టివ్‌గా వున్నట్లు లేదు.

మరదలు వచ్చి నాలుగు రోజులయింది. హుషారుగా కాలక్షేపం చేస్తున్నాం. నా శ్రీమతికి మెంటల్ స్ట్రెయిన్ ఎందుకని ఎంత చనువున్నా మరదలితో అంటీ ముట్టనట్లుగానే వుంటున్నాను నేను.

పెళ్ళయ్యాక నాలో కొత్తగా వచ్చిన ఈ రిజర్వ్‌డ్‌నెస్‌ని ముందు నుంచే నాతో చనువుకే చవిచూపిన నా మరదలు అర్థం చేసుకోలేక ఆశ్చర్యపోతూండి వుంటుంది. తను మాత్రం తన సహజ ధోరణిలో చలాకీగా కబుర్లు చెపుతూ, హుషారుగా మసలుతూనే వుంది.

"ఏమండీ... ఇవాళ తొందరగా రండి... సినిమాకి వెళ్దాం..." మధ్యాహ్నం ఆఫీసుకి బయల్దేరుతూన్న నాతో అంది శ్రీమతి.

"ఓ... తప్పకుండా."

థియేటరు దగ్గర మామూలుగా టిక్కెట్లు తీసు కోవటానికి వెళుతున్న నాతో అంది మరదలు—

"బావా - జంట్స్ వైపు పెద్ద క్యూ వుందిగా. నేను లేడీస్ బుకింగ్‌కి వెళితే తొందరగా తేవచ్చు" అంది చనువుగా నా చేతిలోని డబ్బుల్ని అందుకుంటూ.

నేను అలవోకగా శ్రీమతి వంక చూశాను. ఓ మాటు యిదే మాట నేను నా శ్రీమతితో అంటే -

"అంటే నేను టిక్కెట్లు తెస్తే లేడీస్ మధ్యలో యిస్తాదు - హాయిగా కూర్చోవచ్చనా...' అంది కసిగా.

అంతే. అప్పట్నుంచీ ఎప్పుడూ ఎంత క్యూ వున్నా నేనే టికెట్లు తేవటం అలవాటు.

మరదలు లేడీస్ బుకింగ్‌లో టికెట్లు కొనటంవల్ల మా సీట్లు ఆడాళ్ళ మధ్యలోనే వచ్చాయి. తప్పనిసరిగా నేను నా శ్రీమతీ, మరదళ్ళ మధ్యనే కూర్చోవలసి వచ్చింది.

సినిమా మంచి రొమాంటిక్‌గా సాగుతూంది.

ఛేర్ హాండ్ రెస్ట్ మీద చేయి వుంచబోయిన నేను అప్పటికే అక్కడ వున్న మా మరదలు చేయి తగలటంతో, నా చేయి వెనక్కి తీసుకుని నా ఒళ్ళో పెట్టుకున్నాను.

"ఫర్వాలేదు బావా - మీరు పెట్టుకోండి" అంటూ నా ఒళ్ళోంచి నా చేతిని లాగి హాండ్ రెస్ట్‌పై తన చేతి పక్కన పెట్టుకుంది. ఈ కదలికకి నా శ్రీమతి కొద్దిగా సర్దుకుని నావైపుగా వొరిగి నన్ను ఆనుకుని కూర్చుంది.

సినిమా చూస్తున్న నాలో కొంచెం కొంచెంగా ప్రారంభమయిన ఆశ్చర్యం సినిమా పూర్తయేసరికి బాగా పెరిగిపోయింది. కారణం... హాండ్ రెస్ట్ మీద నా చేతి పక్కన వుంచిన మరదలి చేయి మెల్లమెల్లగా నా చేయి మీదికి పాకింది. అక్కడితో ఆగక సుతారంగా అర చేతిలో రేఖలు గీయటం సాగించింది. నా చెయ్యిని తీసివేసే ప్రయత్నం కూడా రెండు మూడు మార్లు చేయగా, అందుకు అవకాశం యివ్వకుండా దాని చేత్తో నా చేతిని గట్టిగా అదిమిపట్టింది. ఎక్కువగా కదలిక అయితే ఈ వ్యవహారం నా శ్రీమతి కళ్ళబడటం... ఆమె ఏమేమో ఊహించేసుకుని... ఇదంతా ఎందుకులే అని అలాగే భరించి ఊర్కున్నా, అంత చీకట్లోనూ ఒకటి రెండుసార్లు కళ్ళు చించుకుని దానివంక చూశా- అదిగాని నావైపు చూస్తే కళ్ళతోనైనా హెచ్చరిద్దామని. ఊహు, అది సీరియస్‌గా సినిమా చూసేస్తూనే వుంది; చేత్తో చేసేది చేస్తూనే వుంది. నా మౌనాన్ని ఏమనుకుందో ఏమో... తన చేతిని మెల్లగా నా భుజం మీదికి పాకించింది. నడుం మీదుగా తొడమీదికి రానిచ్చింది.

దాని చేష్టలకి చచ్చే కోపం వస్తున్నా ఎలాగో భరించాను.

సినిమా పూర్తయి జనంతోబాటు బయటికి వస్తుండగా నా శ్రీమతి గమనించకుండా మరదల్తో అన్నాను-

"ఏయ్! నువ్వు పెద్దయ్యేకొద్దీ మరీ నాటీగా తయారవుతున్నావ్... నువ్వు చేసిన అల్లరి మీ అక్కగాని గమనించివుంటేనా..."

"అంటే అక్క గమనించకపోతే నా అల్లరి మీకు బానే వుందా?" అదే స్థాయిలో అదీ కొంటెగా గుసగుసమంది.

'అమ్మో! దీంతో మాట్లాడ్డం కష్టమే' అనుకుని నోర్మూసుకున్నాను.

అయితే నా మరదలి పోకడలు పోనుపోనూ నాకు మరీ విచిత్రంగా తోచసాగాయి. ఆమె కదలికలూ, చేష్టలూ, కొంటెతనం హద్దుల్ని దాటుతున్నట్లనిపించ సాగింది.

వాళ్ళక్క లేనప్పుడు నన్ను హత్తుకుంటూ కూర్చుని

మాట్లాడటం, పరసమైన జోకులు వేయటం... నేను నవ్వినప్పుడు...

"అబ్బా... మీరు నవ్వితే మీ బుగ్గలెంత బాగా సొట్టలు పడతాయి బావా" అంటూ బుగ్గలు చిదిమి ఫ్లయికిస్సులు యివ్వటం... నాకు కొంచెం విపరీతంగానే తోచింది.

అయినా మొదట్నుంచీ వున్న చనువువలన నేను ఆ విషయంగా మరోలా మాట్లాడటం బాగుండదని ఉదాసీనంగా వుండిపోయాను.

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నించి వచ్చిన నేను రోజూ లాగానే స్నానం చేసి పైజమా, లాల్చీ వేసు కూర్చున్నాను.

నా శ్రీమతి పక్కింటి ఫ్రెండ్‌తో కలిసి ఏదో షాపింగ్‌కని వెళ్ళిందట. మరదలు ఒక్కతే వుంది యింట్లో. నా అలవాట్లన్నీ దానిక్కూడ బాగా తెలుసు. నేను స్నానం చేసి వస్తూనే -

"బావా - టేబిల్ మీద టిఫెన్ వుంచాను. తిన్కుంటూ వుండండి... నేనిప్పుడే స్నానం చేసి వచ్చి మీకు కాఫీ కలిపి ఇస్తాను"

చలాకీగా చెప్పి స్నానానికి వెళ్ళింది.



దాని గురించే ఆలోచిస్తూ పరధ్యానంగా టిఫెన్ చేస్తూన్న నేను చల్లటి స్పర్శతో ఉలికిపడి తలతిప్పి చూశాను. పెద్ద టర్కీ టవల్ని గుండెల మీదుగా మోకాళ్ళ వరకూ చుట్టుకుని నా ఛెయిర్ వెనుగ్గా నా భుజాలపై తన చేతులానించి నిలబడింది మరదలు.

వయస్సుని మించిన బరువుతో దాని పరువం పొంగులు వెనుక నుండి నా తలని తాకుతున్నాయి.

"ఏంటి బావా - ఇంకా టిఫిన్ చేయటమే కాలేదు... నేనింత సేపు స్నానం చేసినా..." గోముగా అంది.

దాని ఈ ప్రవర్తనకి నేను నిజంగా దిమ్మెర పోయాను.

అలా బాత్ టవల్‌తో అది నాకు అంత చేరువగా వచ్చి నిలబడటాన్ని ఊహించుకోలేక పోతున్నాను.

అసలు దాని ఉద్దేశమేమిటో గ్రహించాలను కున్నాను.

తన చేతుల్ని నా భుజాల మీదుగా మెడ క్రిందికి చేర్చింది.

"అమ్మో - మీ వళ్ళు యింత వేడిగా వుందేమిటి?" కొంటెగా, కవ్వింపుగా అంది.

"మరి నీలాంటి పడుచు పరువం యిలా చుట్టే నిలబడితే ఎవరికైనా ఒళ్ళు కాలిపోక ఏమవుతుంది?" నేనూ ఊరింపుగా అన్నాను.

'నిజం...?!' అసలే పెద్ద కళ్ళని మరింత విప్పార్చి, నా తలని వెనక్కి వంచి నా నొసలిపై గట్టిగా ముద్దు పెట్టింది. నా తలని తన వక్షానికేసి బిగుతుగా అదుము కుంది.

ఒక్కసారిగా దాన్ని విదిలించి లేచి నిలబడ్డాను. ఈ పరిణామానికి అది తొట్రుపడింది.

నా కళ్ళలో కోపం చూడటం దాని కదే ప్రథమం.

"చూడు నీరూ... నువ్వు చల్లని నీళ్ళలో స్నానం చేసి వచ్చి నన్ను ముట్టుకున్నావు కనక నా ఒళ్ళు వేడిగా వుండటం సహజమే. కానీ అన్ని చన్నీళ్ళలో తడిసి




వచ్చినా నీలో వేడి వుండే... అది మాత్రం చాలా అసహజం'' కొంచెం కటువుగా అని బయటికి వెళ్ళి పోయాను.

శ్రీమతి వచ్చాక తిరిగి వచ్చాను. అక్కణ్ణుంచి నీరజ ప్రవర్తనలో తేడా నాకు కొట్టొచ్చినట్లు కనబడింది. వాళ్ళక్క లేని సమయం చూసి నా దగ్గరికి వచ్చి అంది-

''బావా మీ ముందు నిలబడ్డానికే నాకు సిగ్గుగా వుంది. జరిగిందాంట్లో ప్రధానమైన తప్పిదం నాదే అయినా, అసలు విషయం వింటే మా అక్క బాధ్యత కూడా వుందని మీరు ఒప్పుకుంటారు...'' దాని మాట లకి దానివంక ఆశ్చర్యంగా చూశాను.

''అవును బావా. శెలవుల్లో నాల్గు రోజులుండి వెళ్ళనే అని రాసిన అక్క నేనిక్కడికి రాగానే ''నీరూ... మీ బావకి ఆఫీసులో ఓ అందమైన లేడీ స్టెనో, యింకా ఎందరో లేడీ ఎంప్లాయీసు వున్నారు. అవకాశం, ఏకాంతం దొరికితే వాళ్ళతో ఆయన గారెల్లా ప్రవర్తి స్తారో తెలుసుకోవాలని వుంది. అందుకని మీ బావ దగ్గర నీకున్న చనువుతో ఏదైనా ట్రిక్ ప్లే చేసి ఆయనెలా రియాక్టవుతారో గమనించి చెప్పాలే''అంది. ముందుగా దాని పిచ్చి ఆలోచనకి దాన్ని కసిరినా, తరువాత దాని బలవంతం మీద 'సరే మిమ్మల్నో ఆట పట్టిద్దామని' సరదా పుట్టి ఒప్పుకున్నాను. అయితే కొంటెగా మొద లెట్టిన నేను, ఒళ్ళు తెలియనితనంతో వివేకం కోల్పోయి అసంబద్ధంగా ప్రవర్తించాను. మీ మంచితనంవల్ల నేనుగా మిగిలిన నేను మీ క్షమాపణల్ని కోరుతున్నాను...''

ప్రశాంతంగా నవ్వుతూ మరదలి భుజం మీద ఉల్లాసంగా తట్టి అన్నాను -

''హామ్మో... నువ్వు బాగా చదువుతున్నావా... లేక పోతే సినిమాలు జోరుగా చూస్తున్నావా? భలే పెద్ద పెద్ద డైలాగులు చెబుతున్నావు...''

మా మరదలు వెళ్ళిపోయాక సమయం చూసి నా శ్రీమతితో సెమీ సీరియస్‌గా అన్నాను-

''నా గురించి నీకు మీ చెల్లెలు ఏమి రిపోర్టిచ్చిం దోయ్'' అని.

ఉరుముల్లు లేని పిడుగు మీద పడ్డట్లు చలించిపోయింది శ్రీమతిగారు.

తెల్లముఖం వేసి నాకేసి వెర్రిచూపులు చూసింది.

సీరియస్‌నెస్ వదలిస్తూ అన్నాను—

''అహహ... ఖంగారుపడకు... అయితే నువ్వనుకునే లాంటివాణ్ణే నేనయితే, ఈపాటికి పువ్వులాంటి నీ చెల్లికి ఎంతో అన్యాయం చేసినవాడినయి వుండేవాడిని.''

నా శ్రీమతి నోట మాట రాలేదు.

''అంతేకాదు... పిచ్చిపిచ్చి ఊహల్తో నువ్విలాంటి చిత్ర విచిత్రమైన విన్యాసాలు చేయటం సాగించావంటే నన్ను చెడగొట్టుకున్నదానివే అవుతావ్...'' నవ్వుతంగా హెచ్చరించినట్లుగా అన్నాను. ఆ మాట కూడా భరించ లేనట్లు నా శ్రీమతి నన్నల్లుకుపోయింది. నా శ్రీమతి ప్రేమాతిరేకం తెలిసిన నేను ఆమెని నా గుండె నిండుగా పొదవుకున్నాను.

సంయమనం వున్నదీ, తెలివైనది కావటంవల్ల... ఆ తరువాత నా శ్రీమతి తన వృథా అనుమానాల్తో నన్ని బ్బంది పెట్టిన దాఖలాలు లేవు.

●

